సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 21-1-2025

సంపుటి: 20 సంచిక: 253

పేజీలు: 4 వెల: రూ.1

# భావనపాడులో పెట్రో కెమికల్ హబ్ ఏర్పాటుచేయండి

▶▶ లక్ష్మీమిట్టల్‌ను కోరిన నారా లోకేశ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్సెలార్ మిత్తల్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీమిట్టల్‌తో ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ భేటీ అయ్యారు. దావోస్‌లో మంగళవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భావనపాడులో పెట్రో కెమికల్ హబ్ ఏర్పాటుకు పెట్టుబడులకు లోకేశ్ ఆహ్వానించారు. పెట్రోకెమికల్స్ అన్వేషణకు భావనపాడు వ్యూహాత్మక ప్రాంతమని తెలిపారు. ఏపీలో సోలార్ సెల్ తయారీ ప్లాంటు ఏర్పాటును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ప్రణాళికాబద్ధమైన 83.3 ఎంటీపీఏ సామర్థ్యం గల పోర్టు, విశాఖపట్నంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్

- మిగతా 4లో



# కళావతి కాకపోతే కన్నతండ్రే!



- పేర్లవారి సందులో బంగారు గాజుల అమ్మకం
- క్రైమ్ స్పాట్‌లోనే చెవిదిద్దులు
- గంజాయికి పూర్తిగా బానిసైన నిందితుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక న్యూకాలనీలో శనివారం ఓ వివాహిత హత్య కేసులో నిందితుడుగా ఉన్న అండులూరి శరత్‌కుమార్ పూజారి కళావతిని హత్య చేయకపోయినా తన కన్నతండ్రిని మాత్రం హతమొందించడానికి గడిచిన కొద్ది రోజులుగా సన్నద్ధమవుతున్నాడని తెలిసింది. కోట్ల ఆస్తి ఉన్నా ఒక్కగానొక్క కొడుకైన తనను తండ్రి బయటకు పంపించేశాడని, ఆ ఇంటిలో ఉంటున్నవారందర్నీ హత్య చేసేయాలంటూ గంజాయి, మందు కొడుతున్న ప్రతిసారీ శరత్‌కుమార్ తన బ్యాచ్ వద్ద కేకలు వేసేవాడని చెప్పుకుంటున్నారు. గంజాయి బాగా తలకెక్కేయడంతో పిచ్చి ప్రేలాపనలే తప్ప సొంత కుటుంబీకుల్ని ఏం చేస్తాడులే అని వీరు లైట్ తీసుకున్నట్టు చెబుతున్నారు. శనివారం కూడా బంగారంతో వచ్చిన కళావతిని కేవలం గంజాయి, మందు జల్సాలకు డబ్బు అవసరమయ్యే హతమొందించాడని పోలీసులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తుంది. ఎందుకంటే.. మృతురాలి చేతికి ఉన్న రెండు గాజులను స్థానిక బంగారం కొట్ల సందులో ఒకరికి అమ్మేసి ఆ సొమ్ముతోనే రూ.40వేలు తన మిత్రుడికి శరత్ అప్పు తీర్చాడు. మరో రూ.2లక్షలు ఇస్తానని, హత్య కేసు నుంచి తప్పుకోడానికి తనకు సహకరించాలని ఒక మిత్రుడ్ని కోరడం, ఆయన అక్కడికక్కడే శరత్‌ను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించడం వరకు అందరికీ తెలిసిందే. అయితే ఇప్పటికే విచారిస్తున్న పోలీసులు గాజులను రికవరీ చేయగా, తనకు తీర్చిన రూ.40వేల అప్పును శరత్ మిత్రుడే పోలీసులకు తిరిగి ఇచ్చేశాడు. మృతురాలి చెవికి ఉండాల్సిన దుద్దులు ఘటన జరిగిన ఇంట్లోనే మిద్దె మీద పెట్టినట్లు ఒప్పుకున్నాడని తెలుస్తుంది. మొత్తానికి బంగారాన్ని అమ్మి కొంతమేరకు బకాయిలు తీర్చి మిగతాది జల్సాలకు వాడుకోవడం కోసమే వివాహితను హత్య చేశాడని తెలుస్తుంది.

# న్యూకాలనీ - క్రైమ్ కహానీ

- పట్టపగలే దొంగతనాలు, వ్యభిచారం
- గంజాయిబాబులకు, తాగుబోతులకు అడ్డా
- గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదును వెనక్కు తీసుకునేలా చేసిన సచివాలయం
- కుటుంబంతో రోడ్డెక్కాలంటే హడలిపోతున్న జనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం క్రైం)

రెండు రోజుల క్రితం నగరం నడిబొడ్డులోని న్యూకాలనీలో జరిగిన ఒక వివాహిత హత్య ఘటన ద్వారా ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కిన న్యూకాలనీ వాస్తవానికి గత కొన్నేళ్లుగా నగరంలో జరుగుతున్న క్రైమ్‌కు కేంద్రంగా మారిందన్న విషయం తెలిస్తే పోలీసులు కొట్టిపారేయొచ్చు. కానీ ఇక్కడ జరుగుతున్న నేరాలు, ఘోరాలు తెలుసుకోవాలంటే ఒక్కసారి ఈ కాలనీలో నివసిస్తున్న ప్రజలను అడిగిచూడాలి. అఫీషియల్స్ ఉండే న్యూకాలనీ ఏమిటి? నేరాలకు అడ్డాగా మారడమేమిటి అన్న ప్రశ్న ఎవరికైనా తలెత్తితే కచ్చితంగా వారు ఇక్కడ క్రిమినల్ లాజిక్ మిస్సయినట్టే. ఎక్కడైతే తాము, తమ కుటుంబం, తమ ఉద్యోగం అనుకొని ప్రజలు బతుకుతారో అక్కడే నేరస్తులు అడ్డాలు ఏర్పాటు చేసుకుంటారు. ఈ విషయం పోలీసులకు తెలుసు. అలా అని వారేదో శోధించి, ఛేదించి కనిపెట్టింది కాదు. స్వయంగా తమ కాలనీలో పట్టపగలే భార్యాబిడ్డలతో ఇంటి గేటు బయట అడుగుపెట్టలేకపోతున్నాం మహాప్రభో అంటూ అప్పటి రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసి న్యూకాలనీవాసుల సంఘం విన్నవించింది. ఆ తర్వాత 2023 చివరిలోనే కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది. అప్పటికి ఆ ఫిర్యాదు ఆ గ్రీవెన్స్‌లో ఇవ్వడం నాలుగోసారి. కానీ దీని మీద అప్పటి పోలీసు గాని, మున్సిపాలిటీ గాని ఎటువంటి చర్యలూ తీసుకోలేదు సరికదా.. కలెక్టర్ గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదును నిర్ధిష్ట సమయంలో పరిష్కరించాలన్న నిబంధన ఉండటంతో స్వయంగా ఫిర్యాదు చేసినవారి వద్దకే వచ్చి తమ సమస్య పరిష్కారమైపోయిందంటూ ఒక డిక్లరేషన్ తీసుకున్నారు. న్యూకాలనీ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రానప్పుడు సమస్య పరిష్కరించారని తామెలా అంగీకరిస్తామంటూ కాలనీ సంఘం పెద్దలు ప్రశ్నిస్తే వారి మీద రాజకీయంగా ఒత్తిడి తెచ్చి ఫిర్యాదు పరిష్కారమైనట్టు బలవంతంగా సంతకం చేయించారు. అంటే ఇక్కడ జరుగుతున్న క్రైమ్‌కు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అప్పటి వార్డుస్థాయి నాయకుల ప్రమేయం ఉందని అర్థమవుతుంది.



హత్య జరిగిన ప్రాంతానికి 15 అడుగుల దూరంలో ఉన్న మందుబాబుల అడ్డా

ప్రస్తుతానికి వస్తే శనివారం రాత్రి మర్డర్ జరిగిన భవనానికి 15 అడుగుల దూరంలోనే గంజాయిబాబులు, తాగుబోతుల అడ్డా ఉంది. వార్డు రాజకీయంలో భాగంగా వ్యాపారం చేయకపోయినా రోడ్డుకు ఒక పక్కన డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు ఆసుపత్రి ఎదురుగా కొంతమంది బడ్డీలను నిలిపారు. ఇప్పుడు ఈ బడ్డీల వెనుక ప్రాంతమే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా. పక్కనే ఉన్న పాన్‌షాపు నుంచి సిగరెట్ కొనుక్కోవడం, అందులో పొగాకును తీసి గంజాయి దట్టించి ఆ రోడ్డు మీదే రాత్రీపగలూ తూగుతుండటం కాలనీవాసులందరికీ తెలుసు. ఇక ఇక్కడ బడ్డీల్లో మందు అమ్మకపోయినా ఏకంగా తాగడం కోసం సిమెంట్ దిమ్మను కూడా ఏర్పాటు చేసుకున్నారు. పక్కనే ఉన్న పాన్‌షాపులో సోడాలు, నీరు కొనుక్కుని రాత్రీపగలు ఇక్కడ తాగుతున్నారు. ఈ విషయం మీద గతంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఖాళీగా ఉన్న బడ్డీల వెనక్కు వెళ్లకుండా నాలుగు కర్రలు అడ్డుపెట్టారు. ఈమాత్రం దానికే గంజాయి, మందు తాగేవారు ఆగిపోతారని పోలీసులు ఎలా భావించారో అర్థం కావడంలేదు. న్యూకాలనీలో అందరూ అఫీషియల్స్ ఉంటారు కాబట్టి తామేం చేసినా ఓ మెట్టు దిగి అడిగే ధైర్యం చేయరనేదే వీరి బలం. ఎన్నిసార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అక్కడ సంఘ విద్రోహ కార్యకలాపాలకు అడ్డాగా ఉన్న బడ్డీలను తొలగించలేరనేది రాజకీయం. ఈ రెండూ వెరసి న్యూకాలనీని క్రైమ్‌స్పాట్‌గా తయారుచేశాయి. స్వయంగా నగరంలో పేరుమోసిన ఓ ఆడిటర్ ప్రాక్టీస్ చేస్తున్న కార్యాలయం మీదే మర్డర్ జరిగిందంటే అక్కడికి 15 అడుగుల దూరంలోనే మందు, గంజాయి 24 గంటలూ అందుబాటులో ఉంటాయంటే న్యూకాలనీ పరిస్థితి ఎలా దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. 1965

- మిగతా 4లో

# ఇదే 'మెయిన్' అనుకోకండి!

**రేపు మావాడి అసలు పరీక్ష.. తెల్లవారి మార్నింగ్ వాక్‌లో ఓ తండ్రి ఆవేదన.**

**మా అమ్మాయి మ్యాథ్స్‌లో ఫర్వాలేదు కానీ.. ఫిజిక్స్‌తోనే కాస్త ప్రాబ్లెమ్. ఏం చేస్తుందో ఏమో..!?**

**పండగ సెలవుల్లో పుస్తకం పక్కన పడేశాడు. మావాడి ర్యాంక్‌పై నాకు డౌటే.. ఇది మరో తండ్రి నిట్టూర్పు.**

**పరీక్ష సెంటర్ మా ఊర్లో పెట్టాలి అనుకున్నా కానీ.. వాడి కాలేజీ ప్రిన్సిపాల్ ఆ ఛాన్స్ ఇవ్వలేదు.. ఇంకో తండ్రి అర్థం లేని ఆరోపణ.**

విశేషం ఏంటంటే.. రేపటి నుంచి ఐఐటి, ఎన్ఐటిల్లో ప్రవేశాలకు అర్హత కల్పించేందుకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్స్ జరగడమే. ఈ పరీక్షలు పిల్లలకు సంబంధించినవే అయినా వారికన్నా పెద్ద పరీక్ష వారి తల్లిదండ్రులకే. ఇప్పుడు రాయబోతున్న పిల్లల్లో దాదాపు సగానికి పైగా వారి ఐదో తరగతిలోనే ఈ దిక్కుమాలిన ఐఐటి ఫౌండేషన్ కోర్సుల్లో చేరి ఉంటారు. ఏళ్ల తరబడి హాస్టళ్లలో మగ్గిపోయిన పిల్లలు ఎందరో. వారికి లక్షల్లో ఫీజులు కట్టిన తండ్రులు ఇంకెందరో. బహుశా ఇంతలా యాతన పడిన తండ్రుల తరం ముందు ఎప్పుడూ ఉండి ఉండదు. కార్పొరేట్ కాలేజీల గేట్ల దగ్గర వేలాడుతూ మావాడు ఎలా చదువుతున్నాడో అని కిటికీ సందులోంచి చూసిన తండ్రిని ఏమనుకోవాలి. మీకు ఒకసారి చెబితే వినబడదా, ఇది విజిటింగ్ అవర్ కాదు అని సెక్యూరిటీ గార్డు భుజం మీద చేయి వేసి తోస్తే ఇది మావాడి కోసమే కదా అని సరిపెట్టుకున్న పెద్దాయన్ని చూసి నవ్వాలో, ఏడ్వాలో తెలియని పరిస్థితి. మా అమ్మాయి ఫీజు కట్టడానికి మూడు గంటలు లైన్‌లో నిలబడాలని గొప్పలు పోయే తండ్రి గురించి ఎంత చెప్పినా తక్కువే. మావాడు మంచి ర్యాంకు కొడితే ఈ కష్టాలు, అవమానాలు అన్నీ మర్చిపోవచ్చు అని సర్దుకుపోవడమే చివరకు మిగిలేది.

సరే ఇక విషయానికి వద్దాం. ఇది పిల్లల కోసం రాస్తున్న వ్యాసం కాదు.. కేవలం పిల్లల కోసం పిచ్చెక్కిపోయి, మానసికంగా పిల్లల కోసం విపరీతంగా ఒత్తిడికి గురవుతున్న పేరెంట్స్ కోసం. మీకు ఒక వాస్తవం తెలియాలి. కరోనా తర్వాత పిల్లల ఆటిట్యూడ్ పూర్తిగా మారిపోయింది. మీరు పడిన ఒత్తిడిలో సగం కూడా వాడు హాస్టల్‌లో పడడం లేదు. వాడికి తెలుసు.. మంచి ర్యాంక్ రాకపోతే మరో రూ.25 లక్షలు పోసి వాడ్ని ఏ ప్రైవేటు యూనివర్సిటీలోనో మీరు జాయిన్ చేస్తారని. మీ ఆస్తిపాస్తులు మీకన్నా ఎక్కువ వాడికే తెలుసు. ఇక వాడి కాలేజీలో కూడా ప్రైవేటు యూనివర్సిటీల ప్రమోషన్ విపరీతంగా జరుగుతుంది. ఇక మీరు చేయాల్సిందల్లా సాధ్యమైన వరకు ప్రైవేటు వర్సిటీల జోలికి వెళ్లకండి. మిమ్మల్ని చాలామంది ప్రోత్సహిస్తారు. బహుశా వారి అమ్మాయో, అబ్బాయో అక్కడ ఉండి ఉంటారు. ఇది షేర్ మార్కెట్ తరహా బిజినెస్. నష్టం ఎవడూ చెప్పడు. మెయిన్స్‌లో ఒక తరహా ర్యాంక్ రాదు అనుకున్నప్పుడు ఈ నెల నుంచి అనేక పరీక్షలకు నోటిఫికేషన్స్ వస్తాయి. అప్లై చేయమని చెప్పండి. సగానికి పైగా ఎన్ఐటిల కన్నా ఇవి అనేక రెట్లు మెరుగైనవి. సెంట్రల్ యూనివర్సిటీ, ఇఫ్లు, ఐజర్, నైజర్, మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాటస్టిక్స్, ఇస్మాట్, జిప్మాట్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఇలా ఎన్నో.. కనీసం ఒక పది ప్రభుత్వ రంగంలో ఉన్న ఉన్నత విద్యా సంస్థలు నిర్వహించే ఎంట్రెన్స్ పరీక్షలు రాయించండి. మీ వీధిలో ఇంకో ఇంజినీర్ను తయారుచేస్తారో, లేదా భిన్నంగా మరో ప్రొఫెషన్‌లో చేర్పించి మార్గదర్శకులు అవుతారో నిర్ణయించుకోండి. దయచేసి గతంలో వారి పిల్లల్ని జాయిన్ చేసిన ఇన్‌స్టిట్యూట్ గురించి మాత్రం వారిని అడగకండి.. నిజం చెప్తే ఒట్టు!



### అందరూ సుందర్ పిచాయ్‌లు కాలేరు..

మన దేశంలో ఐఐటీ అనగానే పక్క రాష్ట్ర నుంచి వెళ్లి గూగుల్ సీఈవో సుందర్ పిచాయే మనకు కనిపిస్తాడు. కానీ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం పరిస్థితుల వల్ల ప్రతిష్టాత్మకమైన ముంబయి, కాన్పూర్, ఢిల్లీ, ఖరగ్‌పూర్, చెన్నై వంటి క్యాంపస్‌లలో ఐఐటీ చదివిన మెరిట్ స్టూడెంట్లకు సైతం గత కొన్నేళ్లుగా ఉద్యోగాలు రావడంలేదు. కేవలం ఐఐటీల్లో 15 నుంచి 30 శాతం మాత్రమే మంచి ఉద్యోగాలను పొందగలుగుతున్నారు. ఇక కోటి రూపాయల ప్యాకేజీతో ఉద్యోగానికి పట్టుకెళ్లడమనేది కలగా మారిపోయింది. గడిచిన విద్యాసంవత్సరంలో 38 శాతం ఐఐటీ పూర్తిచేసినవారికి ఉద్యోగాలే రాలేదు. ఈ విషయాన్ని ఏ కోచింగ్ సెంటరూ, ఏ యూనివర్సిటీలు చెప్పవు. ఒకప్పుడు ప్రీ ప్లేస్‌మెంట్ పేరుతో ఐఐటీ చదువుతుండగానే ఇంటర్న్‌షిప్ తమ దేశంలో చేసి ఆ తర్వాత ఆకర్షణీయమైన ప్యాకేజీతో ఉద్యోగం ఇస్తామని ఒప్పందం చేసుకున్న విదేశీ కంపెనీలు ఇప్పుడు అటువైపు చూడటంలేదు సరికదా.. ఐఐటీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలకు వచ్చి సెలక్ట్ అయ్యారంటూ కాల్‌లెటర్ ఇచ్చి కూడా జాబ్‌లోకి తీసుకోని సంఘటనలు కోకొల్లలు. ఐఐటీ అనగానే గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా ఏఐ, జీఈ వంటి సంస్థల్లో తమ పిల్లలకు ఉద్యోగావకాశాలు వస్తాయని తల్లిదండ్రులు భావిస్తున్నారు. కానీ వెస్ట్రన్ కంట్రీస్‌లో ఆర్థిక మాంద్యం తీవ్రంగా ఉంది. ఉన్న ఉద్యోగుల్నే పీకేస్తున్నారు. ఇండియాలో అంత స్థాయిలో ఆర్థికమాంద్యం లేకపోయినా ఇక్కడ పని చేయడాన్ని ఐఐటీ విద్యార్థుల తల్లిదండ్రులు చిన్నతనంగా భావిస్తున్నారు. వందమంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో కేవలం ఒక్క శాతం మాత్రమే ఐఐటీలకు వెళ్తున్నారు. మిగిలిన 99 శాతం మందిని ఇక్కడ తల్లిదండ్రులు నలిపేస్తున్నారు. ఈ ఒక్క శాతంలో 8 నుంచి 9మంది మాత్రమే పెద్ద కంపెనీలకు గత కొన్నేళ్లుగా సెలక్ట్ అవుతున్నారు. వీటన్నింటినీ తెలుసుకోపోవడం వల్ల జేఈఈ మెయిన్స్ మాత్రమే జీవితంలో మెయిన్ అనుకొని తల్లిదండ్రులు అనుభవిస్తున్న స్ట్రెస్‌కు ఏ మందేస్తే సరిపోతుందో డాక్టర్లకు కూడా అర్థం కావడంలేదు.



- సీహెచ్ దుర్గాప్రసాద్

బాబు కృషితో విశాఖఉక్కుకు

# ఆర్థిక భరోసా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని గత ముఖ్యమంత్రి జగన్ ప్రయత్నిస్తే, విశాఖ ఉక్కును ఏ విధంగా పరిరక్షించాలని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని, చంద్రబాబు కృషితో ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఎ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్రకే కాకుండా యావత్ ఆంధ్ర రాష్ట్రానికి మణిహారం విశాఖ కర్మాగారమని, వేలాది మంది తెలుగువారు కలిసి వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవింపజేయడానికి ఎన్డీయే ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. తనపై ఉన్న కేసుల నుంచి విముక్తి కల్పించాలని, కావాలంటే రాష్ట్రాన్ని తాకట్టుపెడతానని జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఢిల్లీ వెళ్లేవారని, నేడు అందుకు భిన్నంగా సీఎం చంద్రబాబు హస్తినకు వెళ్లి వస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఆర్థిక సంక్షోభంలో పూడుకుపోయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినేట్ కమిటీ ఆమోదముద్ర వేసిందని చెబుతూ హర్షం తెలిపారు. 1994లో నష్టాల పేరుతో బీఐఎస్ఆర్ ప్రమాదం ఏర్పడితే, దాన్ని అధిగమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి పునర్వ్యవస్థీకరణ జరపకుండా, ప్లాంట్లను అమ్మడానికి ప్రయత్నించిందని, ఎర్రన్నాయుడు నేతృత్వంలో టీడీపీ ఎంపీల పోరాటంతో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, 1998లో నాటి ప్రధాని వాజ్‌పేయితో మాట్లాడి రూ.1,650 కోట్లు తీసుకువచ్చి విశాఖ ఉక్కును పరిరక్షించారని గుర్తుచేశారు. ఉక్కు కర్మాగారానికి రికార్డు స్థాయిలో లాభాలు వచ్చేలా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేసిందని, 2002లో అప్పటి కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొందని, అప్పుడు నష్టాల్లో ఉన్నప్పుడు కాపాడిందని, నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో నుంచి స్టీల్‌ప్లాంట్‌ను గట్టెక్కించింది చంద్రబాబని అన్నారు. విలేకరుల సమావేశంలో సింతు సుధాకర్, మాదారపు వెంకటేష్, అంపోలు మూర్తి, గండేపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

• ఎడిటోరియల్

# తిండి కోసమే తిప్పలు

హౌ ఇండియా లివ్స్ వెబ్‌సైట్ సేకరించిన గణాంకాల ప్రకారం సాధారణ భారతీయుల రోజువారీ జీవితం అప్పుల సుడిగుండంలోకి మునిగిపోతోంది. వేర్వేరు స్వతంత్ర సంస్థలు వేర్వేరు కోణాల్లో ప్రస్తావించిన గణాంకాలను ఓ క్రమానుగతంగా అధ్యయనం చేస్తే భారత ఆర్థిక వ్యవస్థలోని సంక్షోభం లోతుపాతులు అర్థం చేసుకోవచ్చు. దేశంలో కంపెనీల ఉత్పత్తి, నిల్వలు, అమ్మకాలు, లాభాలు అన్నీ ప్రజల వినిమయ శక్తి, పొదుపు సామర్థ్యంతో ముడిపడి ఉంటుంది. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం పన్ను రాయితీలు, ఉత్పాదకతతో ముడిపెట్టిన రాయితీలు, భూమి కేటాయింపుల్లో రాయితీలు ఇస్తున్నా ఉత్పత్తి కంపెనీలు విదేశీ వాణిజ్యంతో పోటీ పడగల స్థాయిలో రాణించటం లేదు. దాంతో విదేశీ పోటీలో తట్టుకుని కంపెనీలు నిలవాలంటే దేశీయ సరుకు ఉత్పత్తి ధర మరింత తక్కువగా ఉండాలని, అది సాధ్యం కావాలంటే కార్మికులు వారానికి 90 గంటలు పని చేసేందుకు సిద్ధమవ్వాలనీ ఎల్ అండ్ టి కంపెనీ చైర్మన్ సుబ్రమణ్యం వంటివారు పిలుపునిస్తున్నారు. ఇన్ని రాయితీలు ఇస్తున్నా దేశీయ కంపెనీలు లాభాల బాట పట్టకపోవడానికి కారణం ఏమిటి? గత నాలుగేళ్లుగా వినిమయ దారుల నిజ ఆదాయాలు పడిపోవటంతో వినిమయ సరుకుల కొనుగోళ్ల పట్ల ఆసక్తి చూపటం లేదని హౌ ఇండియా లివ్స్ వెబ్‌సైట్ సేకరించిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వినిమయ సరుకుల కంపెనీలు తమ వార్షికాదాయాల్లో ఐదుశాతం కంటే ఎక్కువ వృద్ధిరేటును సాధించలేకపోతున్నాయి. సగటున దేశ ఆర్థిక వ్యవస్థ ఏడు నుంచి ఎనిమిది శాతం వృద్ధి రేటును సాధిస్తుందని ప్రభుత్వం భరోసా కల్పించేందుకు ఎంత ప్రయత్నం చేస్తున్నా రంగాలవారీ వృద్ధిరేటు చూసినప్పుడు ఈ భరోసా నీటిరాతగానే మిగులుతుందన్న సందేహం తలెత్తుతోంది. దీనికి ప్రధాన కారణం పెరుగుతున్న కుటుంబ రుణ భారం. 2020 జూలై నాటికి కుటుంబ రుణభారం రూ.77 లక్షల కోట్లుగా ఉంటే 2024 మార్చి నాటికి రూ.121 లక్షల కోట్లకు పెరగటం ఓ ముఖ్యమైన కారణం. కుటుంబ రుణ భారం రెండు రకాలు. వినిమయ సరుకులు కొనుగోలు చేయటానికి తీసుకునే రుణాలు ఓ రకం అయితే రోజువారీ కుటుంబ నిర్వహణ కోసం రుణం తీసుకోవటం రెండో రకం. యుపిఎ 1, యుపిఎ 2 ప్రభుత్వాల హయాంలో పెరిగిన రుణభారం ఇటు వినిమయ సరుకుల కొనుగోలుకు మళ్లటంతో ఆయా కంపెనీల వృద్ధి రేటు గణనీయంగా పెరిగింది. పదేళ్లలో రెండో రకం రుణభారం పెరుగుతోంది. మెజారిటీ ప్రజల జీవనోపాధి అవకాశాలు చిన్నాభిన్నం అయ్యాయి. కోవిడ్ విపత్తు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేసింది. దాంతో ప్రజల కొనుగోలు శక్తి బాగా క్షీణించింది. బిజెపి ఏలుబడిలో సగటు కుటుంబ రుణ భారం 56 శాతం పెరిగింది. స్థూల జాతీయోత్పత్తిలో ఈ కుటుంబ రుణభారం 41 శాతంగా ఉందంటే ఆర్థిక వ్యవస్థలో డొల్లతనం ఎంత ఉందో అర్థమవుతుంది. మరోమాటగా చెప్పాలంటే ఆయా కుటుంబాలు సాధారణ స్థాయిలో వేతనాలు కూడా పొందలేని దుస్థితికి చేరాయి కాబట్టి కుటుంబ ఆర్థిక అవసరాల భారాన్ని లాగటానికి అప్పులపై ఆధారపడుతున్నాయని, అలాంటి కుటుంబాల మోతాదు గత పదేళ్ల కాలంలో 56 శాతం పెరిగిందని ఈ గణాంకాలు వివరిస్తున్నాయి. రుణభారం పెరిగిందంటే వడ్డీ భారం పెరగకుండా ఉండదు. ఈ పదేళ్ల కాలంలో సగటు భారతీయ కుటుంబాలు గతం కంటే అదనంగా వడ్డీలు కట్టడం కూడా కొనుగోలు శక్తి లేకపోవడానికి ఓ కారణంగా ఉంది. మొత్తంగా ఆయా కుటుంబాలకున్న అప్పుల్లో 30 శాతం కేవలం ఆయా కుటుంబాలు తమ పోషణ కోసం తీసుకున్న అప్పులేనని నిర్ధారణ అవుతోంది. కార్లు, ఇళ్లు, ఇతర వినిమయ వస్తువులు సమకూర్చుకోవడానికి తీసుకున్న రుణాలు కేవలం పది శాతమే. అంటే స్థిరచరాస్థి సమకూర్చుకునే రుణాలు తగ్గిపోతున్నాయి. కుటుంబ పోషణ కోసం తీసుకునే రుణాలు పెరుగుతున్నాయి. దీన్ని మరోలా అర్థం చేసుకోవాలంటే దేశంలో పేదల కుటుంబ ఆదాయం, లేదా ఉపాధి సౌలభ్యం కోసం తీసుకునే రుణాలు తగ్గిపోతూ ఉన్నాయి. కేవలం తిండి తిప్పలు సమకూర్చుకోవడానికి తీసుకుంటున్న రుణాలు పెరిగిపోతున్నాయి. ఈ వివరాలు పరిశీలించినప్పుడు దేశంలో పెరుగుతున్న కుటుంబ రుణభారం ఆర్థిక వ్యవస్థ లో వృద్ధి రేటును మరింత స్థబ్దతకు గురి చేస్తుందనీ, ఈ స్థబ్దతను అధిగమించటానికి కార్పొరేట్ వర్గానికి మరిన్ని రాయితీలు ఇవ్వటమే మార్గమని ప్రభుత్వాలు నిరంతరం ప్రతిపాదిస్తూ ఉంటాయనీ, దీని కోసం జాతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయితే జాతి ఆర్థికంగా బలోపేతం అవుతుందనీ, జాతి ఆర్థికంగా బలోపేతం అయితే ప్రత్యర్థులపై ఆర్థికంగా రాజకీయంగానూ పై చేయి సాధించటం వీలవుతుందనీ, తద్వారా దేశానికి అంతర్జాతీయ కీర్తిప్రతిష్టలు ఆర్జించవచ్చనీ ప్రభుత్వాలు, ప్రభుత్వ వాదనలకు పై వివరణ పరిశీలించినప్పుడు ఆర్థికంగా దేశానికి ప్రత్యేకించి రోజువారీ వేతనాలపై ఆధారపడే కుటుంబాలకు రానున్నది మరింత క్లిష్ట కాలం అన్నది స్పష్టమవుతుంది.

## నిరుపేద కుటుంబంకి రూ.25 వేలు ఆర్థిక సాయం



(సత్యంన్యూస్, నందిగాం)

మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన గుడాపు హేమంత్‌కి భరించలేని కడుపునొప్పి రావడంతో పాత గాజువాకలో వున్న పద్మజ హాస్పిటల్‌కి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు చిన్న ప్రేగుకి ఇన్ఫెక్షన్ అయ్యిందని, సర్జరీ చేయాలన్నారు. ఈ సమస్యకు ఆరోగ్యశ్రీ కూడ వర్తించదని తెలియజేశారు. వీళ్లది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. విషయం తెలుసుకున్న మదనాపురం శ్రీ చింతపోలమ్మ యువజన సంఘం వాళ్ళు పలువురు దాతల ద్వారా సేకరించిన రూ.25వేలు మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంలో సంఘసభ్యులు ఈ నిరుపేద కుటుంబంకి పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేస్తారని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీ చింతపోలమ్మ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కృషితో ఉక్కుకు భరోసా



(సత్యంన్యూస్, పాతపట్నం)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థిక భరోసా లభించిందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కృషి పట్టుదలతో ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ సాధించారన్నారు. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేయడం అభినందనీయమన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న స్టీల్ ప్లాంట్‌ను గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే అప్పుల్లో కూరుకుపోయిందని గుర్తుచేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితోపాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటు ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం భారీ సాయాన్ని ప్రకటించిందని ఎమ్మెల్యే వివరించారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

(సత్యంన్యూస్, కొత్తూరు)

ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు అన్నారు. కొత్తూరు మండల కేంద్రంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ తులసీ వర ప్రసాద రావు మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ పాల ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి ప్రభుత్వం ఉచితంగా గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఈ శిబిరాల ద్వారా పశు వైద్య చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన వంటి సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ రావు, మండల వెటర్నరీ స్టాఫ్ స్థానిక రైతులు పాల్గొన్నారు.



## రాంప్రతాప్‌కు చిత్రకళా బ్రహ్మోత్సవం అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కోనసీమ చిత్రకళా పరిషత్, అమలాపురం వారు ప్రతి ఏడాది నిర్వహించే 35వ అంతర్జాతీయ చిత్రకళా పోటీలలో మురపాక చిత్రకారుడు రాంప్రతాప్‌కు చిత్రకాళా బ్రహ్మోత్సవం అవార్డు (నగదు బహుమతి) లభించింది. "బ్లాస్మింగ్ హార్మోనీ" అనే చిత్రానికి ఈ అవార్డు వచ్చినట్లు రాంప్రతాప్ తెలిపారు. అదే విధంగా ఆయన భార్య లలితకు కూడా కేసీపీ అవార్డు వచ్చిందని తెలిపారు. దీంతోపాటు 250 మంది ప్రముఖ చిత్రకారులతో "బోర్న్ టు ఎక్సెల్" అనే పుస్తకంలో కూడా రాంప్రతాప్ చోటు సంపాదించారు.



## బుడుమూరులో బౌద్ధ విగ్రహాలు లభ్యం

(సత్యంన్యూస్, లావేరు)



మండలంలోని బుడుమూరు గ్రామంలో శాలిహుండంలో ఉన్న బౌద్ధుల సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన అనేక విగ్రహాలు గ్రామమంతా దర్శనమిస్తున్నాయి. ఈ విగ్రహాలు బుద్ధుల కాలం కంటే ముందు అమ్మవారిగా కొలిచిన మారిచి అమ్మవారి విగ్రహం గ్రామం మధ్యలోనే ఉండడం విశేషం. ఈ విగ్రహాన్ని స్థానికులు ఒమరవల్లి అమ్మవారు అని పేర్కొంటున్నారు. ఏనుగుపై అమ్మవారు ఉన్న విగ్రహము బుద్ధులు కాలం కంటే ముందు ఆరాధించిన సందర్భం మనకు కనిపిస్తోంది. అలాగే కళింగ గాంగుల కాలంలో ఉన్న విగ్రహాలు కూడా కొన్ని చిన్న చిన్నవి గ్రామాల్లో కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో కొందరు గ్రామపెద్దలు దుర్గాదేవి గుడిని నిర్మించారని ఆ సందర్భంలో నాలుగైదు విగ్రహాలు ప్రాచీనమైనవి లభించగా, వాటిలో బుద్ధుడి విగ్రహాన్ని ప్రక్కన ఉంచడం ఇంటాక్ బృందం గమనించింది. ఈమేరకు సోమవారం సాయంత్రం ఇంటాక్ శ్రీకాకుళం బృందం బుడుమూరు గ్రామాన్ని సందర్శించి, గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు అక్కడ ఉన్న పురాతన విగ్రహాలను పరిశీలించింది. ఈ బృందంలో కన్వీనర్ నూకా సన్యాసిరావు, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు, సీనియర్ మెంబర్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ ఉన్నారు. వీరికి వెంకటాపురం గ్రామానికి చెందిన నెల్లి దాలినాయుడు అనే యువకుడు దగ్గరుండి విగ్రహాలు అన్నిటిని చూపించారు. ఈ బృందం గమనించినంతవరకు గతంలో ఈ ప్రాంతమంతా కూడా కళింగ గంగుల పాలనలో ఉన్నట్లుగాను, అలాగే తదనంతరం బౌద్ధ సంస్కృతి ఆచారాలు సాంప్రదాయాలు ఇక్కడ వెల్లివిరిసినట్లుగా భావిస్తోంది. దీనిపై విస్తృత పరిశోధన జరిపితే ఈ ప్రాంతం చారిత్రక వైభవాన్ని తెలుసుకోవచ్చని వీరు అభిప్రాయపడ్డారు. ఈ గ్రామంలో ఉన్న కొన్ని విగ్రహాలకి గ్రామస్తులు పెయింటింగులు వేసి వాటికి పసుపు రాసి ఆరాధిస్తున్న విషయం తెలిసింది. ఈ మేరకు అక్కడ లభించిన విగ్రహాల చిత్రాలను ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు పంపించనున్నట్లు బృంద కన్వీనర్ నూకా సన్యాసిరావు తెలియజేశారు.




# ఫిబ్రవరి వినోదాల విందు




టాలీవుడ్ లో సంక్రాంతి సినిమాలు కొత్త ఏడాదికి మంచి ఆరంభాన్ని అందించాయి. 'గేమ్ ఛేంజర్' 'డాకు మహారాజ్' 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి మూడు చిత్రాలు రిలీజైతే, వాటిల్లో రెండు సినిమాలు బ్లాక్ బస్టర్ విజయాలు సాధించాయి. వెంకటేశ్ నటించిన 'సంక్రాంతికి..' మూవీ పొంగల్ విన్నర్ గా నిలిచింది. రాబోయే రెండు వారాల వరకూ తెలుగులో పెద్ద రిలీజులేవీ లేవు కాబట్టి, అప్పటి వరకూ సంక్రాంతి చిత్రాల సందడే కొనసాగే అవకాశం ఉంది. అయితే ఫిబ్రవరి నెలలో మాత్రం పలు క్రేజీ చిత్రాలు థియేటర్లలోకి రాబోతున్నాయి.

'తండేల్' సినిమాతో అక్కినేని నాగచైతన్య ఫిబ్రవరికి స్వాగతం పలకనున్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రం వచ్చే నెల 7వ తేదీన విడుదల కానుంది. ఇందులో సాయి పల్లవి హీరోయిన్. అల్లు అరవింద్ సమర్పణలో నిర్మాత బన్నీ వాస్ భారీ బడ్జెట్ తో ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఒక పాట మినహా టాకీ పార్ట్ మొత్తం పూర్తయింది. ఆల్రెడీ రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాకు మంచి హైప్ తీసుకొచ్చింది. 'లవ్ స్టోరీ' తర్వాత చైతూ - సాయి పల్లవి కలిసి నటించిన ఈ చిత్రంపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా, అందమైన ప్రేమకథతో 'తండేల్' సినిమా రూపొందింది. చైతన్య తన కెరీర్ లోనే తొలిసారిగా డీగ్లామర్ క్యారక్టర్‌లో, ఒక మత్స్యకారుడిగా కనిపించనున్నారు. 'బుజ్జి తల్లి' పాట చూస్తుంటే సాయి పల్లవితో చైతూ కెమిస్ట్రీ బాగా కుదిరినట్లు అర్థమవుతుంది. రాజు, బుజ్జి తల్లి పాత్రల్లో ఇద్దరూ అద్భుతమైన నటన కనబరిచారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తెలుగుతో పాటుగా హిందీ, తమిళ భాషల్లో విడుదల కాబోతున్న ఈ చిత్రం.. వాలెంటైన్స్ వీక్ లో బ్లాక్ బస్టర్ గా నిలుస్తుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు.

'తండేల్' కంటే ఒక్కరోజు ముందుగా అజిత్ నటించిన 'పట్టుదల' అనే డబ్బింగ్ మూవీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ముందుగా పొంగల్ కు రిలీజ్ చెయ్యాలకున్న ఈ చిత్రాన్ని చివరకు ఫిబ్రవరి 6న విడుదల చేస్తున్నారు. మగిళ్ తిరుమేని డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో త్రిషా కృష్ణన్ హీరోయిన్ గా నటించింది. ఇక ఫిబ్రవరి రెండో వారంలో ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న 'లైలా', 'దిల్ రూబా', 'బ్రహ్మ ఆనందం' వంటి ముచ్చటగా మూడు సినిమాలు బాక్సాఫీస్ బరిలో దిగుతున్నాయి.

విశ్వక్ సేన్ నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'. ఇందులో విశ్వక్ ఒక అమ్మాయి పాత్రలో కనిపించడం ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది. 'క' లాంటి సక్సెస్ ఫుల్ మూవీ తర్వాత కిరణ్ అబ్బవరం నుంచి వస్తున్న సినిమా కావడంతో 'దిల్ రూబా'పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

రియల్ లైఫ్ లో తండ్రీకొడుకులైన బ్రహ్మానందం - రాజా గౌతమ్.. 'బ్రహ్మ ఆనందం' సినిమాలో తాత-మనవడిగా నటించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికైతే ఈ మూడు సినిమాల టీజర్లు ఆకట్టుకున్నాయి.

లాస్ట్ ఇయర్ ఫిబ్రవరికి 'ఊరు పేరు భైరవకోన'తో హిట్టు కొట్టిన సందీప్ కిషన్.. ఈసారి ఫిబ్రవరి 21న 'మజాకా' మూవీతో అలరించడానికి వస్తున్నాడు. త్రినాథరావు నక్కిన తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్ గా నటిస్తుండగా.. రావు రమేష్, అన్షు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథ్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న 'డ్రాగన్' సినిమాని కూడా ఫిబ్రవరి మూడో వారంలో థియేటర్లలోకి తీసుకురానున్నారు. హీరో ధనుష్ దర్శకత్వం వహిస్తున్న 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే తమిళ డబ్బింగ్ చిత్రాన్ని కూడా అదే రోజున రిలీజ్ చేయాలని చూస్తున్నారు.

ఇక మహా శివరాత్రి స్పెషల్ గా పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయ్యాయి. వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో నితిన్ హీరోగా నటిస్తున్న 'తమ్ముడు' చిత్రాన్ని 2025 శివరాత్రికి రిలీజ్ చేస్తామని నిర్మాత దిల్ రాజు గతంలో ప్రకటించారు. అలానే బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కలిసి నటిస్తున్న 'భైరవం' సినిమాని కూడా అదే సీజన్ లో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఆది పినిశెట్టి నటిస్తున్న 'శబ్దం' సినిమాని ఫిబ్రవరి ఆఖరి వారంలో రిలీజ్ చెయ్యాలని మేకర్స్ భావిస్తున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..













# మన నోబెల్ స్థాయి.. ఎక్కడుంది?

**ఆధునికతరం 6జీ వెంట కాంతివేగంతో పరుగుపెడుతుంది. ఎనిమిది దశాబ్దాల చేరువలో స్వాతంత్ర్య భారతం వికసిత భారత్ అంటూ ఆశావాదంతో అడుగులు వేస్తోంది.ఓ ప్రక్క అంతరిక్ష ప్రయోగాల్లో మంగళయాన్,చంద్రయాన్ తో పాటు నేటి స్పేస్ డాకింగ్ విజయంతో మనం ప్రపంచ యవనికపై మన సత్తా చాటుతున్నాం. బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతున్నాం.కానీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం మన జనాభా స్థాయిలో లేదన్నది మనం గమనించాల్సిన విషయం. ముఖ్యంగా మన పరిశోధనలు, ఆవిష్కరణలు అంతర్జాతీయ స్థాయిని ప్రభావితం చేయటం లేదనేది మనం విశ్లేషించుకోవాల్సిన సందర్భం. శతాబ్దం పైగా చరిత్ర వున్న నోబెల్ బహుమతుల విషయంలో అసలు మన ప్రయాణం ఏమిటనేది నేడు చర్చించి, కారణాలను అన్వేషించాల్సిన సందర్భం.**

ఎన్నో శతాబ్దాల క్రిందటే ప్రపంచ విజ్ఞానానికి గణితం, ఖగోళ శాస్త్రం, ఆయుర్వేదం, రసాయన శాస్త్రాల్లో మన శాస్త్రవేత్తలు చేసిన కృషి నేటి ఆధునిక సైన్స్ కు పునాదిగా నిలిచింది.ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, మహావీర, వరాహమీర, భాస్కర,పతంజలి,చరక,సుస్రుత, భరద్వాజ తదితరుల వంటి విఖ్యాత శాస్త్రవేత్తల మేధస్సు ప్రపంచపు పరిజ్ఞానాన్ని ప్రభావితం చేసింది.

మనకు స్వాతంత్ర్యం రాకముందే బ్రిటీష్ వారి క్రింద బానిసత్వపు పాలన కాలంలోనే ఆసియా ఖండంలోనే సాహిత్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్, భౌతికశాస్త్రంలో సి.వి రామన్ వంటి మహానుభావులు తొలి నోబెల్ సాధించి భారతీయుల సత్తా ప్రపంచానికి తెలియజెప్పారు. నేడు జనాభాలోనే అగ్రస్థానంలో వుంటూ, ప్రపంచ ఆర్థికవ్యవస్థను సైతం ప్రభావితం చేస్తూ, శతాబ్దాల నాగరికతను కలిగివున్న భారత దేశం నుంచి కేవలం మన పౌరసత్వంతో ఫిజిక్స్ లో, సాహిత్యంలో 78 వసంతాల స్వాతంత్ర్య భారత్ నుంచి మనం నోబెల్ బహుమతి గెలవలేకపోయామంటే మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన బిలియన్ డాలర్ల క్వశ్చన్.ప్రతిభకు అత్యుత్తమ కొలమానం నోబెల్ బహుమతి కానప్పటికీ, నోబెల్ కమిటీలపై ఎన్నో వివాదాస్పద వ్యాఖ్యలు వున్నప్పటికీ నోబెల్ బహుమతుల విలువను ప్రపంచం "విశ్వ విజేత స్థాయి"గానే చూస్తుందనడం మనం కాదనలేని సత్యం.

"Where the mind is without fear and the held is high;Where knowledge is free;Where the world has not been broken up into fragments by narrow domestic walls;... my father,let my country awake" వంటి సుప్రసిద్ధ గేయంతో గీతాంజలి వంటి అసాధారణ, అసామాన్యమైన రచనతో 1913 లోనే నోబెల్ సాహిత్య బహుమతి గెలిచారు మన విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్.మన జనగణమన గీతంతో పాటు బంగ్లాదేశ్ దేశపు జాతీయ గీతాన్ని ఠాగూర్ రచించారు.శాంతినికేతన్ స్థాపనతో నేటి ఆధునిక భారతీయ విద్యా విధానంలో కూడా వారి ఆలోచనలు మనకు మార్గదర్శనం చేస్తున్నాయి.ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మహాత్మా గాంధీజీ వంటి విఖ్యాత ప్రముఖులతో సైతం ఎన్నో ఆధ్యాత్మిక, తాత్విక, పర్యావరణ,శాస్త్రీయ విశ్లేషణలను పంచుకున్నారు.వివేకానంద వారి రచనల నుంచి ఠాగూర్ ప్రేరణ పొందారు.

"నా మతం సైన్స్. నేను దాన్నే ఆరాధిస్తాను. నిత్య సాధకులైన వారే నా వారసులు"అంటూ కేవలం రూ.200 పరికరాల సాయంతో రామన్ ఎఫెక్ట్ ను కనుగొని 1930 లో మనకు ఫిజిక్స్ విభాగంలో నోబెల్ అందించారు.నోబెల్ బహుమతి తీసుకునే సందర్భంగా మన దేశపు జెండా లేనందుకు కన్నీటి పర్యంతమవుతూ, నిజాయితీతో కూడిన భావోద్వేగాల తన దేశభక్తిని ప్రదర్శించి నిజమైన భారత రత్నంగా భవిష్యత్తు తరాలకు ఆదర్శమయ్యారు.1943లో తానే సొంతంగా బెంగళూరులో రామన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ స్థాపించి మన దేశంలోనే విక్రమ్ సారాభాయ్, హోమీ జహంగీర్ బాబా, అబ్దుల్ కలాం వంటి మహామహులకు దిక్సూచిగా నిలిచారు. నేటి ఆధునిక ప్రపంచం సైతం ఇంకా "రామన్ ఎఫెక్ట్ కు ఎఫెక్ట్ అవుతూనే వుంటూ ఎన్నో ప్రకృతి రహస్యాలను ఛేధిస్తుంది.

సి.వి రామన్ బంధువు అయిన సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ విఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త. భారతీయ-అమెరికన్‌గా నక్షత్రాల పరిణామంపై పరిశోధనలు చేసి చంద్రశేఖర్ లిమిట్‌తో ఖ్యాతి గడించారు. బ్లాక్ హోల్స్‌పై వీరి పరిశోధనల విషయాలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. వీరి కృషికి గుర్తింపుగా 1983 లో విలియం ఎ.ఫౌలర్‌తో కలిసి భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. వీరిలాగే మదర్ థెరిస్సా, హరగోవింద్ ఖొరానా, అమర్త్యసేన్, వెంకట్రామన్ రామకృష్ణన్ వంటి వారు మన దేశ మూలాలు కలిగిన నోబెల్ విజేతలు. 2014లో మలాలా యూసఫ్ జాయ్‌తో కలిసి ప్రఖ్యాత భారతీయ బాలల హక్కుల ఉద్యమకారుడు కైలాస్ సత్యార్థి మన దేశ పౌరసత్వంతో నోబెల్ శాంతి బహుమతి గెలిచారు. గాంధీజీ నుంచి ప్రేరణ పొందిన వీరు "బచ్ పన్ బచావో ఆందోళన్" వంటి ఎన్నో కార్యక్రమాలతో బాలకార్మిక వ్యవస్థపై, విద్యా వ్యవస్థపై ఎన్నో ఉద్యమాలు చేశారు. లక్షలమంది పిల్లల జీవితాలను మార్చారు. కొన్ని సందర్భాల్లో ఎన్నో విమర్శలు, భౌతిక దాడులు ఎదుర్కొన్నప్పటికీ "నువ్వు కాకపోతే ఇంకెవరు? ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ? అంటూ సమాజంలో మార్పు రావాలని అలుపెరగని ప్రయాణం చేస్తున్నారు.

గాంధీజీ, అరబిందో, మేఘనాథ్ సాహా, హోమీ జహంగీర్ బాబా, సత్యేంద్రనాథ్ బోస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మన దేశ ప్రముఖులు ఎన్నో సార్లు నోబెల్ బహుమతికి నామినేట్ అయినప్పటికీ ఎన్నో ఆనాటి రాజకీయ, సామాజిక కారణాల చేత అవార్డుకు ఎంపిక కాలేదు. విశేషం ఏమంటే సత్యేంద్రనాథ్ బోస్ వంటి వారి కనుగొన్న దైవ కణం విషయాలపై పరిశోధనలు చేసిన వారు నోబెల్ గెలిచారు. గాంధీజీని ఆదర్శంగా తీసుకొని ప్రపంచవ్యాప్తంగా అహింసా మార్గంలో పోరాటం చేసిన ఎంతోమంది నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు. ఒబామా, మార్టిన్ లూథర్‌కింగ్, దలైలామా, ఆంగ్ సాన్ సూకీ వంటి నోబెల్ విజేతలకు గాంధీజీనే రియల్ హీరో. చరిత్రను పరిశీలిస్తే 1948 లో గాంధీజీ హత్యకు గురికాకుంటే ఆ సంవత్సరం గాంధీజీకి నోబెల్ దక్కేదేమో! గాంధీజీ నోబెల్ వివాదంపై 2006లో నోబెల్ కమిటీ "మన 106 సంవత్సరాల చరిత్రలో అతి పెద్ద లోపం"అంటూ స్పందించింది.

స్వాతంత్ర్య భారతంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన పరిశోధనలు, ఫలితాలు ప్రపంచస్థాయిలో లేకపోవడమే నోబెల్‌లో నేటి మన ప్రదర్శనకు ప్రధాన కారణం.మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలి. విశ్వవిద్యాలయాల్లోని ఉన్నత విద్యలో, పరిశోధనల్లో రాజకీయ జోక్యం వుండకూడదు. బడ్జెట్ పెంచాలి. యువతరాన్ని పరిశోధనల వైపు ప్రోత్సహించాలి. ఫెలో షిప్స్ అమౌంట్ పెంచాలి. నేటితరపు చదువులు మార్కులు, ఉద్యోగం,సంపాదన చుట్టే తిరుగుతున్నాయి. ఆ దృక్పథాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు మార్చుకొని, శాస్త్రవేత్తలకు సరైన గుర్తింపు మనదేశంలో ఇవ్వాలి. విదేశాలకు వెళ్ళే శాస్త్రవేత్తల వలసలను ఆపాలి. ఉన్నత విద్యా వంతులు రాజకీయాల్లోకి వచ్చి శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి నూతన చట్టాలతో కృషి చేయాలి.పాఠశాల స్థాయి విద్య నుంచే గొప్ప గొప్ప శాస్త్రవేత్తల జీవితాల గురించి, సమాజం నుంచి వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, గెలుపోటములకు సంబంధం లేని వారి ప్రయత్నాల పరంపర గురించి విద్యార్థులకు స్ఫూర్తివంతమైన విధానాలతో తెలియజెప్పాలి.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రగామిగా వుండాల్సిన అవసరం కనిపిస్తోందని,యువత పెద్ద పెద్ద కలలుగనమని యావత్ భారతాన్ని ప్రభావితం చేసిన అబ్దుల్ కలాం జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్ళాలి.మన తరగతి గదుల్లో శ్రీనివాస రామానుజన్ వంటి అసాధారణ భారతరత్నాలు ఉదయించాలి. త్వరలోనే రవీంద్రనాథ్ ఠాగూర్, సివిరామన్ వంటి మహానుభావుల స్ఫూర్తితో మళ్ళీ మనదేశం ప్రపంచానికి నోబెల్ వెలుగులతో అనంత విశ్వం దాకా అన్వేషణ కొనసాగాలని ఆశిద్దాం.జగదీశ్ చంద్రబోస్, సలీం అలీ ,సి.యన్.ఆర్ రావు,కల్పనా చావ్లా,బిమ్లా బూటి వంటి మన శాస్త్ర వేత్తలను నేటి తరాలకు గొప్ప హీరోలుగా పరిచయం చేస్తూ గౌరవిద్దాం.నవతరం విన్నూత్న ఆవిష్కరణలతో విదేశీ గడ్డలపై మన జాతీయ పతాకాన్ని ఎగిరేలా మన ప్రయాణం,మన ప్రయత్నం కొన సాగిద్దాం.

**ది వైర్ కోసం..**

**ఫిజిక్స్ అరుణ్ కుమార్,**
నాగర్ కర్నూల్, 9394749536

## ఎల్‌టీఐ మైండ్ ట్రీ ప్రాంగణ నియామకానికి ఎంపికలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ఎల్‌టీఐ మైండ్ ట్రీ కంపెనీ నిర్వహించిన ప్రాంగణనియామకాలలో 16మంది 3.2 లక్షల వార్షిక వేతనంతో కొలువులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలియజేశారు. వీరిరువురూ మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం నుండే ఉద్యోగాలకు ఉపయోగపడే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇస్తున్నామన్నారు. అదే విధంగా ప్రస్తుత రోజులలో సాఫ్ట్‌వేర్ రంగాలలో ఎంతో ప్రాధాన్యత ఉన్న కోడింగ్ పైన



విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినిలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు అభినందించారు.

## ఆడంబరంగా జాతీయ బాలికా దినోత్సవ సంబరాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 24న దేశవ్యాప్తంగా ఆడపిల్లల కేరింతల మధ్య జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో చైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం సారధ్యాన శ్రీకాకుళం పట్టణంలోని బెహరా మనో వికాస కేంద్రం విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి ప్రారంభించారు. విందు, వినోదాలు, ఆటలు, పాటలు నడుమ ముందస్తుగా జాతీయ బాలికా దినోత్సవ సంబరాలు మంగళవారం జరుపుకుంటుండడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. కేంద్రం ప్రాంగణంలో ముందుగా విద్యార్థులకు అల్పాహార విందుతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బాలికలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం ప్రత్యేక విందుతో కార్యక్రమం ముగిసింది. అనంతరం విద్యార్థినులనుద్దేశించి సీతారాం మాట్లాడుతూ చైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం పిల్లల సేవా కార్యక్రమాలు ప్రారంభ సూచికగా విభిన్న ప్రతిభావంతులైన పిల్లల మోముల్లో హర్షాతిరేకాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఫోరంనకు చిరస్థాయిలో మరువలేని గుర్తులుగా ఉంటాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలతోపాటు పిల్లలకు ఉపయుక్తంగా ఉండే రక్తదాన శిబిరాలతోపాటు వివిధ రకాల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణకు అడుగులు వేయాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్ని చట్టాలు అమలులో ఉన్నా నిత్యం ఆడపిల్లలపై వేధింపులు అఘాయిత్యాలు జరుగుతుండడం విచారకరమన్నారు. వీటిని రూపుమాపేందుకు ప్రభుత్వాల సహాయ సహకారాలతో పాటు సమాజంలో బాలల శ్రేయస్సుకు పని చేస్తున్న ఎన్జీవోలు, వివిధ సంఘాలు చేయూతనందించాలని పిలుపునిచ్చారు. చైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి మాట్లాడుతూ తాము ఐదురోజులపాటు ఈ జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నామన్నారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి ఉపయుక్తంగా ఉండే వివిధ కార్యక్రమాలను రూపకల్పన చేయనున్నామని చెప్పారు. నిత్యం బాలల వెన్నంటి ఉండే చక్కని ఫోరంగా నిలిచేందుకు ప్రణాళికలతో ముందుకెళతామన్నారు. కార్యక్రమంలో బాలల సంఘాల ప్రతినిధులు మెట్ట మల్లేశ్వరరావు, కొత్తకోట శ్రీనివాసరావు, మొదలవలస వాసుదేవ కుమార్, సింగూరు ప్రవీణ్, పైడి బాలకృష్ణ, బగాది ప్రవీణ్, మోహిని, పి.మాధురి, విజయభాస్కర్‌లు పాల్గొన్నారు.




## ఎండియు ఆపరేటర్ల పై తప్పుడు ప్రచారం తగదు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎండీయూ ఆపరేటర్లపై తప్పుడు ప్రచారాలు తగదని ఎండియూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ హెచ్చరించారు. నగరంలోని ఎన్జీవో హోం కార్యాలయ ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా డీలర్ మృతి పట్ల మౌనం వహించి తమ ప్రగాఢ సంతాపాన్ని ఈ సందర్భంగా నిమిషంపాటు మౌనం వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఆపరేటర్ల వ్యవస్థ వలన డీలర్స్ సంఘానికి గాని డీలర్ కలిగే నష్టం ఏంటని ప్రశ్నించారు. ఎలాంటి వ్యాఖ్యలను తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా ఎండియు ఆపరేటర్ ఆత్మహత్య చేసుకున్నాడని, అయితే దానికి బాధ్యులపై చర్యలు తీసుకోమని కోరామని డీలర్ల సంఘ నాయకుల వ్యాఖ్యలు చేయలేదని గుర్తుచేశారు. నెల్లూరు జిల్లాలో ఓ డీలర్ మృతికి ఎండియూ ఆపరేటర్ల వేధింపులే కారణమని చెప్పడం, అది వాస్తవం అయితే ఆ ఎండియూ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవడంలో ఎటువంటి తప్పు లేదని కాకపోతే ఎండియు వ్యవస్థను తప్పుపడుతూ ఆ విధంగా మాట్లాడడం హేయమైన చర్య అన్నారు. నెల్లూరు జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షులు సుదర్శన రావు ఇటువంటి దుష్ప్రచారాలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎండియు ఆపరేటర్లతో మీకు ఇబ్బందులు ఉన్నట్లయితే సంబంధించిన జిల్లా ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అంతేగాని ఎండియు వ్యవస్థను తప్పుపడుతూ దుష్ప్రచారాలకు పాల్పడడం తగదని, ఇలాంటి ప్రచారాలు చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ఎండియూ ఆపరేటర్లతో సమస్యలు ఉంటే యూనియన్ నాయకుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అటువంటి ఎండియూ ఆపరేటర్స్‌పై యూనియన్ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలపై పౌరసరఫరాల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎండియు ఆపరేటర్లు అప్పారావు, శివప్రసాద్, శ్రీను, కిషోర్, మాధవ్, బాలకృష్ణ, కిరణ్, వరుణ్, జగన్, రాజా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి,
రైల్వే, ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్,
ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా,
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు,
ఫర్నిచర్ మేనుఫేక్చర్స్
(హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు,
మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ
జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు,
శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001




## విశ్రాంత వ్యవసాయ అధికారుల నూతన కార్యవర్గం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల జిల్లా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ప్రకటించారు. స్థానిక సంఘం భవనంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సంఘం ప్రతినిధులు ప్రకటించారు. సంఘం అధ్యక్షురాలిగా కుంచాల ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా దావాల నారాయణరావు, కార్యదర్శిగా కొమ్మల తవిటయ్య, కోశాధికారిగా జీఎస్ ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులుగా బెహరా రమణమూర్తి, నల్లాన ప్రభాకరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వీఎస్ఎస్ కేశవరావు, ఉపాధ్యక్షులు మెట్ట అన్నాజీ భట్లు, కార్యదర్శ కూన తవిటినాయుడు, ఉభయ తెలుగు రాష్ట్ర విశ్రాంత వ్యవసాయ సంక్షేమ సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పాపినాయుడు, విశాఖ జిల్లా అధ్యక్షులు సంజీవరావు, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించి పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువతో సన్మానించారు.

## న్యూకాలనీ - క్రైమ్ కహానీ

(మొదటిపేజీ తరువాయి)



గత ఏడాది అక్టోబర్‌లో పట్టపగలే బరాటం శ్రీను ఇంట్లోకి రాడ్డుతో చొరబడిన గంజాయిబాబు

నుంచి 69 మధ్య మొట్ట మొదటిసారిగా హౌసింగ్‌బోర్డు వేసిన వెంచర్ ఇప్పుడు వైభవాన్ని పూర్తిగా కోల్పోయింది. శిమ్మ జగదానందం హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా పనిచేసిన రోజుల్లో పురుషోత్తపురం సర్పంచ్ కిల్లి వెంకటప్పలనాయుడు లాంటి ప్రముఖులు పట్టుపట్టడంతో హౌసింగ్‌బోర్డు తరఫున ఒక ఎకరానికి 8 ప్లాట్లు చొప్పున సుడా, ఉడా వంటి సంస్థలు లేని రోజుల్లో విశాలమైన లేఅవుట్ ఇది. అటువంటిది ఇప్పుడు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిపోయిందని, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్రమంత్రి, స్థానిక ఎమ్మెల్యే నిర్వహించిన గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితికి దిగజారిపోయింది. అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఎవరు కారణం? వంటి అంశాలపై మరో కథనంలో తెలుసుకుందాం.

## తిడ్డిమిలో ఉచిత పశు వైద్య శిబిరం

(సత్యంన్యూస్, పాతపట్నం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరంలో ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న ప్రతిపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం తిడ్డిమి గ్రామంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశువులకు ట్యాగింగ్ చేయించుకోవాలని, అలాగే పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని, అప్పుడే ఎటువంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చున్నారు. పాడిపశువుల పెంపక రైతులకు పశువైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాడి రైతులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# భావనపాడులో పెట్రో కెమికల్ హబ్ ఏర్పాటుచేయండి

(మొదటిపేజీ తరువాయి)

పెట్రోలియం అండ్ ఎనర్జీ ఉండటం, స్థిరమైన మౌలిక సదుపాయాలు, బలమైన ప్రభుత్వ మద్దతు పెట్రోకెమికల్ రంగంలో పెట్టుబడులకు అనుకూలతలుగా ఉంటాయని లోకేశ్ వివరించారు.

భావనపాడు-మూలపేట ప్రాంతం తయారీ, ఆర్ అండ్ డీ, లాజిస్టిక్స్ సౌకర్యాలను నెలకొల్పడానికి, పెట్రోకెమికల్స్, గ్రీన్ ఎనర్జీలో నూతన ఆవిష్కరణలకు అసమానమైన అవకాశాలు కలిగి ఉందని లోకేశ్ చెప్పారు. హెచ్‌పీసీఎల్-మిత్తల్ సంయుక్త భాగస్వామ్య సంస్థ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.3,500 కోట్లతో భారత్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్న 2 జీడబ్ల్యూ సామర్థ్యం గల సోలార్ సెల్ తయారీ ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. 2వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు.

**ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్‌కు నిరంతరాయంగా పునరుత్పాదక విద్యుత్**

అనంతరం లక్ష్మీమిట్టల్ మాట్లాడుతూ ఆర్సెలార్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్ జేవీ సంయుక్తంగా 17.8 మిలియన్ టన్నుల కెపాసిటీతో గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్ట్ ఏర్పాటు ప్రక్రియను ఏపీలో ప్రారంభించామని గుర్తుచేశారు. అనకాపల్లి సమీపంలో 2 దశల్లో రూ.1.4 లక్షల కోట్ల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైడ్రో పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌ను ఉపయోగించి 975 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఆర్సెలార్ మిత్తల్ భారత్‌లో గ్రీన్‌కో గ్రూప్‌తో భాగస్వామ్యం ఉన్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు అనకాపల్లిలో ఏర్పాటుచేసే స్టీల్ ప్లాంట్‌కు నిరంతరాయ పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేస్తుందన్నారు. దీనివల్ల ఏటా కార్బన్ ఉద్గారాలను 1.5 మిలియన్ టన్నులు తగ్గించే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

**అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తుంది**

అనకాపల్లిలో ఏర్పాటయ్యే ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్‌ప్లాంట్ అతిపెద్ద ప్రాజెక్టు అని సీఎం చంద్రబాబు అన్నారు. అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల్లో ఒకటిగా అది నిలుస్తుందని చెప్పారు. లక్ష్మీమిట్టల్‌తో భేటీ అనంతరం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. లక్ష్మీమిట్టల్, సీఈవో ఆదిత్య మిట్టల్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్నట్లు చెప్పారు. 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్‌కు వారు అంగీకారం తెలిపారన్నారు.

**నెట్‌వర్కింగ్ డిన్నర్‌కు హాజరైన ఏపీ ప్రతినిధుల బృందం**

దావోస్ కాంగ్రెస్ సెంటర్ ప్లీనరీ హాల్ లాబీలో నెట్ వర్కింగ్ డిన్నర్ జరిగింది. దీనికి ఏపీ ప్రతినిధుల బృందం హాజరైంది. సీఎం నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ పాల్గొన్నారు. వివిధ దేశాలకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై నెట్ వర్కింగ్ డిన్నర్‌లో పారిశ్రామికవేత్తలతో మంత్రులు, అధికారులు చర్చించారు.

## జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో స్థానిక డీఎల్‌టీసీ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిరుద్యోగులైన యువతీ యువకులకు సీడ్ ఆఫ్, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ఉద్యోగ అవకాశాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. వివిధ కార్పొరేట్ సంస్థలు, ఫార్మా కంపెనీలు అపోలో, సీనర్జీస్, వంటి అనేక సంస్థలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉద్యోగమేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఆఫ్, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు, ప్రభుత్వ ఐటీఐ అధ్యాపకులు పాల్గొన్నారు.



## ఉద్యోగ, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



(సత్యంన్యూస్, టెక్కలి)

ఉద్యమ నేత వీజీకే మూర్తి మృతి జిల్లా ఉద్యోగ, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. టెక్కలి సిటు కార్యాలయంలో మూర్తి సంస్మరణ సభ మంగళవారం జరిగింది. షణ్ముఖరావు మాట్లాడుతూ వీజీకే సిటు జిల్లా కమిటీ ప్రథమ అధ్యక్షులుగా, సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులుగా ఉంటూ నిరంతర శ్రామికుడుగా ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కరించే కృషి చేశారన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ అభ్యుదయవాదిగానే కాకుండా తన శరీరాన్ని రిమ్స్‌కు అప్పగించిన వీజీకే త్యాగానికి మారుపేరన్నారు. యూటీఎఫ్ నాయకులు పాలవలస ధర్మారావు, సామ దామోదరరావు, సిటు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, ఉర్జాన లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య, జి.సుబ్రహ్మణ్యం, రైతుసంఘం నాయకులు బగాది వాసుదేవరావు, యు.దుర్గాప్రసాద్, నంబాళ్ల రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తిమద్దతు

- చిన్నపిల్లల తల్లులకు ప్రత్యేక సదుపాయాలు: ఎమ్మెల్యే శంకర్
- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తల్లిపాల ప్రత్యేక కేంద్రం ప్రారంభం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జిల్లా ప్రజారవాణా అధికారి విజయ కుమార్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలతో ఏర్పాటుచేసిన తల్లిపాల ప్రత్యేక కేంద్రాన్ని ఎమ్మెల్యే శంకర్ మంగళవారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణ, పరిరక్షణ, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో విస్తృత కేటాయింపులు జరుపుతోందని అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో డాక్టర్ హరనాథ్ ఆర్థిక సహకారంతో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా ప్రధాన బస్ కాంప్లెక్స్‌ల్లో వీటిని ఏర్పాటుచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అలాగే కాంప్లెక్స్ ప్రాంగణంలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చి ప్రయాణికుల్లో బాలల చట్టాలపై అవగాహనా కలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. సీతారాం మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ మొదటి వారంలో జిల్లా ఆర్టీసీ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో జారీచేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలను అమలుచేస్తూ తల్లిపాలు పట్టే ప్రత్యేక కేంద్రం ప్రారంభం జరుగుతుండడం, కాంప్లెక్స్ ప్రాంగణంలో బాలల చట్టాలు, అవగాహన కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల హోర్డింగ్స్ అభినందనీయమన్నారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు శ్రేయస్సును కాంక్షించే ఆర్టీసీ అధికారులగా అభివర్ణించారు. శ్రీకాకుళం ప్రజా రవాణా అధికారి విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సూచనలు, సలహాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలను పాటిస్తూ బాలల హక్కుల పరిరక్షణకు శ్రద్ధ చూపే ఆర్టీసీ కాంప్లెక్స్‌లుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లతో పాటు పలువురు సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అస్వస్థతతో ఉన్నవారింటికి నేరుగా లైఫ్ సర్టిఫికెట్



(సత్యంన్యూస్, పొందూరు)

అస్వస్థతతో కదలలేని స్థితిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారుల ఇంటికే నేరుగా వెళ్లి వార్షిక జీవిత ధ్రువపత్రాలను స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం పొందూరు శాఖ మంగళవారం స్వీకారం చుట్టింది. ఫిబ్రవరి చివరి వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. జీవిత ధ్రువీకరణకు సంబంధించి సంఘ కార్యదర్శి పాలిశెట్టి సూర్యప్రకాశరావు సెల్ 94412 49793ని సంప్రదించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో పి.సూర్యం, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాలవలస దివాకర్ పాత్రో, వాండ్రంగి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంఘ అధ్యక్షులు నాళం పైడిరాజు కోరారు.




# మార్క్సిస్టు మేధావి లెనిన్

- సీపీఎం కార్యాలయంలో శతవర్థంతి
- 25న వీజీకే మూర్తి సంస్మరణ సభ
- లెనిన్, వీజీకేలకు ఘన నివాళి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రపంచ కార్మిక వర్గ శ్వాస లెనిన్ అని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో లెనిన్ శతవర్థంతి ముగింపు సందర్భంగా పెట్టుబడి ప్రజాస్వామ్యం అనే అంశంపై వారు మాట్లాడుతూ ప్రజల కష్టాలకు, కన్నీళ్లకు మూలమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒకవైపు పోరాడుతూనే మరోవైపు 1917లో అక్టోబరులో కార్మిక వర్గం తిరుగుబాటు చేసి రష్యాలో కార్మిక వర్గ సోషలిస్టు రాజ్యాన్ని లెనిన్ ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం మొత్తం కార్పొరేట్ ప్రయోజనాల్ని కాపాడుతుందని, అదానీ లాంటి కొంతమందిని బలపరచడానికి అధికారాన్ని ఒక సాధనంగా వాడుకుంటుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజాస్వామ్య హక్కులు కాల రాయబడుతున్నాయని వారన్నారు. అందరికీ అన్ని అవకాశాలు ఉండే సమాజం కోసం ఐక్య ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సు ప్రారంభానికి ముందు లెనిన్ చిత్రపటానికి, సీపీఎం సీనియర్ నాయకులు వీజీకే మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నెల 25న వీజీకే మూర్తి సంస్మరణ సభ అంబేద్కర్ ఆడిటోరియంలో జరుగుతుందని, అందులో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు జి.సింహాచలం, ప్రజా సంఘాల నాయకులు ఎ.సత్యం, కొత్తకోట అప్పారావు, ఎం.గోపి, ఎంఎం మూర్తి, ఎ.సోమశేఖర్, బి.సింహాచలం, డి.చందు తదితరులు పాల్గొన్నారు.

## 22న మెగా రక్తదాన శిబిరం

(సత్యంన్యూస్, పలాస)

తోటి ప్రాణాన్ని కాపాడుకునే అవకాశం మన చేతుల్లోనే ఉందని, యువత అంతా చేయి చేయి కలుపుదామని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె మీడియాతో



మంగళవారం మాట్లాడారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గ్లో ఆధ్వర్యంలో ఈ నెల 22న మెగారక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కరు చేసిన రక్తదానంతో నలుగురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ఆశాభావం, ప్రమాదాలు చోటుచేసుకున్నపుడు శస్త్రచికిత్సలు, దీర్ఘకాల వ్యాధులైన తలసేమియా, లుకేమియా, హెమోర్జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా, డయాలిసిస్ వంటి సమయాల్లో రక్తం, దాని ఉప పదార్థాల ఆవశ్యకత ఎంతో గొప్పదని వివరించారు. ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెబుతున్నట్లు తెలిపారు. రక్తదానం ఆవశ్యకతను వివరిస్తూ స్వచ్ఛంద సంస్థలు సమర్థమైన పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. పలాస నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యి యూనిట్ల రక్తాన్ని సేకరించే బృహత్కర కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ఎటువంటి అపోహలకు తావీయకుండా యువత రక్తదానానికి ముందుకు వచ్చి మానవత్వం చాటుకోవాలని పిలుపునిచ్చారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.